భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL



# యాదగిరిగుట్ట మహాసభలను విజయవంతం చేయండి: ఏఐవైఎఫ్




భారత్ సమాచార్, యాదాద్రి భువనగిరి జిల్లా: సెప్టెంబర్ 8వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న యువజన భారీ ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. వలిగొండ మండలం దుప్పల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ప్రచార జాతాను ఏఐవైఎఫ్ మాజీ నాయకులు కామ్రేడ్ బాలగోని సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ.. బీహార్‌లో విద్యార్థులు, నిరుద్యోగుల ఆందోళనల సందర్భంగా ఓ బాలుడు విద్య, ఉద్యోగాలు, భవిష్యత్తుపై లేవనెత్తిన ప్రశ్నలను ప్రస్తావించారు. ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కు అని, యువత సమస్యలకు పోలీసు బలంతో కాకుండా పాలనలో జవాబుదారీతనంతో సమాధానం చెప్పాలని అన్నారు.

దేశంలో లక్షలాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, అదే సమయంలో ప్రభుత్వ శాఖల్లో భారీగా ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని ఎల్లంకి మహేష్ పేర్కొన్నారు. ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 'భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్' (బీఎన్ఈజీఏ) రూపొందించి అమలు చేయాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేస్తోందన్నారు. నిరుద్యోగ యువత సమస్యలపై ప్రభుత్వాలు స్పష్టమైన విధానాలతో ముందుకు రావాలని కోరారు.

సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఏఐవైఎఫ్ మాజీ నాయకుడు ఎలగందుల అంజయ్య మాట్లాడుతూ.. దేశంలో సహజ వనరులు, మానవ వనరులకు కొదవ లేదని అన్నారు. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యువతను తీర్చిదిద్ది, సమాజాభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ నాయకులు కట్ల యాదగిరి, నలిగె యాదయ్య, అంబటి అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మొగుళ్ల శేఖర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మారోజు నరసిమాచారి, కార్యదర్శి సుద్దాల సాయికుమార్, మండల సమితి సభ్యులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు

తదితరులు పాల్గొన్నారు. యువత సమస్యలు, ఉద్యోగ అవకాశాలు, విద్య, ఉపాధి అంశాలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని నాయకులు కోరారు.

© 2026 Bharath Samachar